విశాలాంధ్ర గోదావరి జిల్లా
ఏలూరు, పశ్చిమగోదావరి

పర్యావరణాన్ని పరిరక్షించాలి

- జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి

విశాలాంధ్ర -భీమవరం : పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు ముందుకు వచ్చి మొక్కలు నాటి పెంచాలని జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి కోరారు. ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవంలో భాగంగా శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా ఐఎఎస్ అధికారుల సతీమణుల సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. దీనిలో భాగంగా శుక్రవారం స్థానిక గొల్లవానితిప్ప రోడ్డు వెంబడి మొక్కలు నాటే కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి, జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్ సుందర్ రెడ్డి సతీమణి సి.ప్రసన్నతో కలిసి ప్రారంభించారు. జిల్లా నీటి యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. గంగ రావి, పచ్చ తురాయి, బునియ, సీమ తంగిడి, గానుగ, పండ్ల మొక్కలు, తదితర రకాలకు చెందిన సుమారు 400 మొక్కలను రెండు కిలోమీటర్ల పరిధిలో నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ గ్రీన్ ఎర్త్ ... గ్రీన్ ఆంధ్ర ప్రదేశ్ నినాదంతో ఐఎఎస్ ఆఫీసర్స్ వైఫ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లాలో పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టినట్టు తెలిపారు. జాయింట్ కలెక్టర్ సతీమణి సి.ప్రసన్న ఈ కార్యక్రమంలో పాలు పంచుకోవడం జరిగిందని పేర్కొన్నారు. 'హరిత పశ్చిమగోదావరి' జిల్లాగా రూపురేఖలు మార్చడం కొరకు డ్వామా, ఇండస్ట్రీస్, ఎన్జీవోస్, విద్యాసంస్థలు ఆధ్వర్యంలో 50 వేల మొక్కలు ఒకేసారి జిల్లాలో నాటుతున్నామని కలెక్టరు తెలిపారు. జిల్లా అంతటా మూడు రోజుల పాటు 50 వేల మొక్కలు నాటే లక్ష్యంగా శుక్రవారం ఒక్కరోజే 25 వేల మొక్కలు నాటినట్టు కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా నగరవనం పథకంలో భాగంగా చేపట్టిన ఈ మొక్కలు నాటే కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ పివిఎల్ నరసింహారాజు, డ్వామా పిడి ఎస్.టి.వి రాజేశ్వరరావు, డి ఆర్ డి ఎ పి డి ఎంఎస్ఎస్ వేణుగోపాల్, డిఇఓ ఆర్. వెంకటరమణ, ఉపాధిహామీ ఏపిడి విజయలక్ష్మి,, ఉపాధిహామీ సిబ్బంది, పాఠశాలల విద్యార్థులు, సెల్ఫ్ హెల్ప్ గ్రూప్స్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టం గణన

విశాలాంధ్ర- ఏలూరు: జిల్లాలో భారీ వర్షాల కారణంగా పంట నష్టాలను వరద ప్రభావం తగ్గిన తరువాత గణన చేయాలని జిల్లా రెవిన్యూ అధికారి ఏ.వి. ఎన్ . ఎస్. మూర్తి అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ లోని గౌతమీ సమావేశపు హాలులో శుక్రవారం జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశం చైర్మన్ వెజ్జు వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా డిఆర్ఓ మూర్తి మాట్లాడుతూ జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా వరి , తదితర పంటలు నీట మునిగాయని, పంటపొలాల్లో వరద నీరు తగ్గిన తరువాత పంట నష్టం గణన చేసి నివేదిక సమర్పించాలని సంబంధిత శాఖల అధికారులను డిఆర్ఓ ఆదేశించారు. జిల్లాలో ఈ-క్రాప్ బుకింగ్ క్షేత్రస్థాయిలో జియో టాగింగ్ విధానం ద్వారా చేపడుతున్నారన్నారు. ధాన్యం కొనుగోలుకు గోనెసంచుల కొరత లేకుండా చూడాలని సభ్యులు కోరగా వెంటనే చర్యలు తీసుకోవాలని పౌర సరఫరాల శాఖ అధికారులను డి ఆర్ ఓ ఆదేశించారు. చైర్మన్ వెజ్జు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఆక్వా జోన్ లోని కొంతమంది ఆక్వా రైతులకు విద్యుత్ రాయితీ సొమ్ము జమ కావడంలేదని, ఈ విషయం అధికారుల దృష్టికి తీసుకువచ్చా మన్నారు. ఇరిగేషన్ శాఖ సూపెరింటెండింగ్ ఇంజనీర్ శ్రీనివాసరావు సాగు నీటి కాల్వలలో కిక్కిస, గుర్రపుడెక్కతోడు తొలగించాలని, శివారు భూములకు సాగునీరు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు.హార్టికల్చర్ అధికారి రవికుమార్, పౌర సరఫరా సంస్థ జిల్లా మేనేజర్ మంజు భార్గవి, ఎల్ డి ఎం నీలాద్రి , కమిటీ సభ్యులు వెంకటేశ్వరరావు, ఆర్. బాబ్జి, రవీంద్రరెడ్డి, , సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

భారత నిర్మాణంలో యువతదే కీలక పాత్ర

విశాలాంధ్ర -భీమవరం టౌన్ : నవ భారత నిర్మాణంలో యువతదే కీలక పాత్ర అని, యుక్త వయసు రాగానే కోరికలు పరంపరగా వస్తాయని వాటికి లోబడకుండా ముందుకు సాగినప్పుడే యువత భవిష్యత్ బాగుంటుందని భీమవరం డిఎస్పి బి. శ్రీనాథ్ అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం కేజీఆర్ఎల్ కళాశాలలో ర్యాగింగ్ దిశ యాప్ లపై అవగాహన సదస్సు, ర్యాలీ, ప్రతిజ్ఞ నిర్వహించారు. డిఎస్పి శ్రీనాథ్ మాట్లాడుతూ యువత ఎటువంటి ర్యాగింగ్, ఆడపిల్లలపై అత్యాచారాలు, డ్రగ్స్ వినియోగం ఇవన్నీ అనైతిక చర్యలన్నారు. ఒక్కసారి ఛార్జ్ షీట్ నమోదైతే జీవితం నాశనం అవుతుందన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి చట్టాలపై అవగాహన కల్పిస్తూ విద్యార్థులచే ప్రతిజ్ఞ నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మెంటే హరినాథ్ బాబు, ఇన్నర్ వీల్ క్లబ్ జిల్లా కార్యదర్శి అరేటి రాణి, జిల్లా ఆర్గనైజర్ గంధం శ్రీదేవి, పీజీ డైరెక్టర్ డాక్టర్ తోట రామమూర్తి, ఎన్ ఎస్ ఎస్ ఆఫీసర్ జ్యోతి, లక్ష్మిచాయ, నాచు శ్రీవల్లి తదితరులు పాల్గొన్నారు.

కోతకు గురైన రోడ్డు

విశాలాంధ్ర-ఉంగుటూరు: ఉంగుటూరు మండలం రావులపర్రు వద్ద కాగుపాడుకు వెళ్లే ఆర్ అండ్ బి రోడ్డు శుక్రవారం కోతకు గురైంది. రోడ్డు ఉత్తరం వైపు ఉన్న తోకలపల్లి మురుగు కోడు కాలువ నుంచి రోడ్డు కోతకు గురైంది. దీంతో రైతులు, గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు సంఘటన ప్రదేశానికి వెళ్లి పరిశీలించారు. ఇసుక బస్తాలు వేసి పటిష్ట చర్యలు చేస్తున్నారు. రోడ్డు కోతకు గురైందని రావులపర్రు, కాగుపాడు వద్ద అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి రాకపోకలు నిలుపుదల చేశారు. వర్షాలు ఇలాగే ఉంటే గండి పడే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. వర్షాలు ఇలాగే కురిస్తే గండిపడి వరి చేలు ముంపునకు గురవుతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు కోతకు గురైన రోడ్డును యుద్ధప్రాతిపదిక పై పటిష్టంగా పనులు చేసి వరి చేలు ముంపునకు గురికాకుండా చూడాలని రైతులు కోరుతున్నారు.

పర్యావరణ పరిరక్షణ ఉద్యమంలా చేపట్టాలి

విశాలాంధ్ర-ద్వారకా తిరుమల: ప్రతీ ఒక్కరు మొక్కలను నాటి వాటిని పరిరక్షించడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ బి. లావణ్య వేణి అన్నారు. ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా ద్వారకా తిరుమలలోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం కొండపై ఆంధ్ర ప్రదేశ్ పర్యాటక శాఖ వారి హరిత రిసార్ట్స్ ప్రాంగణంలో శుక్రవారం జేసీ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జేసీ లావణ్య వేణి మాట్లాడుతూ, భావితరాల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రతీ ఒక్కరూ పర్యావరణ పరిరక్షణ ఒక ఉద్యమంలా చేపట్టాలన్నారు. జిల్లా వ్యాప్తంగా లక్షల మొక్కల నాటడం లక్ష్యంకాగా, ఇంతవరకు 16300 మొక్కలు నాటించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కె. స్వర్ణలత, డ్వామా పీడీ ఎ. రాము, ఆంధ్రప్రదేశ్, పర్యాటక శాఖ. రీజనల్ డైరెక్టర్ స్వామి నాయుడు, జిల్లా పర్యాటక శాఖ అధికారి మెహరాజ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం జేసీ లావణ్య వేణి ద్వారకా తిరుమలశ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు.

సమర్థవంతంగా పునరావాసం

విశాలాంధ్ర-ఏలూరు: జిల్లాలో వరద ఉధృతి మరింత పెరిగే అవకాశం ఉన్నందున అందుకు అనుగుణంగా పూర్తిస్థాయి దృష్టి సారించి సహాయ పునరావాస కార్యక్రమాలు అత్యంత సమర్థవంతంగా నిర్వహిస్తామని జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ ముఖ్యమంత్రికి తెలియజేశారు. రాష్ట్రంలో వరద పరిస్థితిపై శుక్రవారం రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ వివిధ శాఖల కార్యదర్శు లతో కలిసి వరద ప్రభావిత జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ కు స్థానిక కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్, జిల్లా ఎస్ పి మేరి ప్రశాంతి, జాయింట్ కలెక్టర్ బి. లావణ్యవేణి, ట్రైనీ కలెక్టర్ అపూర్వ భరత్,డిఆర్ఓ ఎవిఎస్ఎస్ మూర్తి, పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతు గత ఏడాది వరదల్లో ఇళ్లు దెబ్బతిన్న 1280 కుటుంబాలకు పరిహారం అందించవలసి ఉందన్న విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లగా దీనిపై ముఖ్యమంత్రి స్పందిస్తూ సంబంధిత పరిహారాన్ని వెంటనే అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకు ప్రస్తుతం వరద సహాయక చర్యలకు విడుదల చేసిన నిధులకు అదనంగా మంజూరు చేస్తామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి జగన్ మాట్లాడుతూ భద్రచలం వద్ద గోదావరి నీటిమట్టం 53.81 అడుగులకు చేరుకునే అవకాశం ఉన్నట్లుగా తెలుస్తోందన్నారు. ధవళేశ్వరం వద్దకూడా వరద ప్రభావం సుమారు 16 లక్షల క్యూసెక్కులకు చేరుకొనే అవకాశం ఉన్నట్టుగా అంచనా వేసినట్టు తెలిపారు. గత ఏడాది గోదావరిలో 26 లక్షల క్యూసెక్కులకు పైగా వరద ప్రవాహం చూశామన్నారు. సహాయ శిబిరాల నుంచి బాధితులు తిరిగి ఇళ్లకు వెళ్లేటప్పుడు ప్రతి కుటుంబానికి రూ.2 వేలు, వ్యక్తులైతే వారికి వెయ్యి రూపాయలు అందజేయా లన్నారు. ఈ సందర్భంగా ఏలూరు జిల్లాలో వరద పరిస్థితిని ముఖ్యమంత్రికి కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ వివరిస్తూ జిల్లాలో వేలేరుపాడు, కుక్కునూరు, పోలవరం ప్రాజెక్టు ప్రాంతంలో వరద ప్రభావం ఉందన్నారు. 31 నివాసిత ప్రాంతాలు ముంపునకు గురయ్యా యన్నారు. జిల్లాస్థాయినుంచి మండల స్థాయి వరకు నిరంతరం పనిచేసే కంట్రోల్ రూమ్స్ కూడా ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో జిల్లా వ్యవసాయశాఖ అధికారి వై.రామకృష్ణ, ఇరిగేషన్ ఎస్ ఈ కె.శ్రీనివాసరావు, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ ఇ ఎన్.సత్యనారాయణ, డ్వామ పిడి ఏ.రాము, మునిసిపల్ కమిషనర్ ఎస్.వెంకట కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వరద ముంపును ఎదుర్కోవడానికి పటిష్ట చర్యలు

విశాలాంధ్ర-భీమవరం: గోదావరి పరివాహక ప్రాంత గ్రామాలలో వరద ముంపును ఎదుర్కోవడానికి అన్ని విధాలుగా సంసిద్ధంగా ఉన్నట్లు జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు.శుక్రవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుండి ముఖ్యమంత్రి వరద ప్రభావం ఉన్న 5 జిల్లాల కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఐదు జిల్లాల కలెక్టర్లు వరద కారణంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. అవసరమైన వారిని పునరావాస కేంద్రాలకు తరలించి అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయాలన్నారు. పునరావాస కేంద్రాల నుండి తిరిగి వెళ్లే సమయంలో ఒక్కొక్క కుటుంబానికి రూ.2 వేలు, సింగిల్ గా ఉన్నవారికి ఒక వెయ్యి రూపాయలు చొప్పున ఇచ్చి పంపాలని ఆదేశించారు. అవసరమైన నిత్యవసర వస్తువులు, బియ్యం పంపిణీ చేయడానికి సిద్ధంగా ఉంచాలన్నారు. ఈ సందర్భంలో జిల్లాలోని వరద పరిస్థితులు, తీసుకున్న చర్యలపై జిల్లా కలెక్టర్ రాష్ట్ర ముఖ్యమంత్రికి వివరిస్తూ వరద ప్రభావం ఎదుర్కోవడానికి అన్ని విధాలుగా సంసిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. జిల్లాలో కలెక్టరేట్, డివిజన్, మండల హెడ్ క్వార్టర్స్‌లో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. యలమంచిలి మండలం కనగాయలంక గ్రామంలో వరద నీటితో కాజ్‌వే నీట మునిగిందని, రోజువారీ ప్రజా జీవితానికి ఇబ్బంది కలగకుండా వారి రవాణా కోసం మోటారు పడవలను ఏర్పాటు చేశామన్నారు. ముందుజాగ్రత్త చర్యలలో భాగంగా పశ్చిమ గోదావరి జిల్లా పరిధిలోని వశిష్ట గోదావరి కుడి ఒడ్డున కి.మీ 39.000 నుండి 90,000 కి.మీ వరకు వల్నబుల్ పాయింట్లను గుర్తించి పెట్రోలింగ్ కు నీటిపారుదల, నదీ పరిరక్షణ శాఖలను ఆదేశించినట్టు తెలిపారు. యలమంచిలి మండలంలోని కనగాయలంక, పెదలంక గ్రామాలు వరద ప్రభావానికి గురికావడం జరిగిందని తెలిపారు. ఈ రెండు గ్రామాల్లో 55 కుటుంబాలు ఉండగా, 125 మంది నివసిస్తున్నట్లు తెలిపారు. పునరావాస కార్యక్రమాల్లో భాగంగా124 మంది గర్భిణీ స్త్రీలను, 127 మంది పిల్లలను తల్లులను సురక్షిత ప్రాంతాలకు తరలించినట్టు తెలిపారు. 22 మెడికల్ క్యాంపులను కూడా ఏర్పాటు చేశామన్నారు. వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్ సుందర్ రెడ్డి, జిల్లా ఎస్ పి యు.రవి ప్రకాష్, జిల్లా రెవెన్యూ అధికారి కే.కృష్ణవేణి, డి.ఎల్.డి.ఓ కేసిహెచ్ అప్పారావు, జిల్లా నీటి వనరుల అధికారి సుబ్రహ్మణ్యేశ్వర రావు, జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేశ్వరరావు, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

నేడు పామాయిల్ రైతుల ధర్నా

విశాలాంధ్ర -చింతలపూడి : పామాయిల్ రైతుల సమస్యలపై శుక్రవారం రేచర్ల కాటా వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని ఏపి కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి దొంత కృష్ణ పిలుపు నిచ్చారు. శుక్రవారం కొమ్ముగూడెం గ్రామంలో రాఘవ అధ్యక్షతన పామాయిల్ రైతుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా దొంతా కృష్ణ మాట్లాడుతూ పామాయిల్ ధర గత సంవత్సరం టన్ను రూ.22వేలు ఉంటే ప్రస్తుత సంవత్సరం రూ.12 నుంచి 13 వేల మధ్య నడుస్తుందన్నారు. ఎరువుల ధరలు విపరీతంగా పెరిగాయన్నారు. పామాయిల్ రైతులు పెరిగిన ఎరువుల ధరలు కూలి రేట్లు కటింగ్ రేట్లు పెరగడం వలన టన్ను రూ.13వేలు ధర వలన వ్యవసాయం చేసే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పామాయిల్ టన్ను రేటు రూ. 25 వేలుగా నిర్ణయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం పామాయిల్ రైతుల కన్వీనింగ్ కమిటీ ఎన్నిక జరిగింది. కొమ్ముగూడెం పామాయిల్ రైతుల కన్వీనర్ గా సాయల నరేంద్ర కన్వీనింగ్ కమిటీ సభ్యులుగా అనంతోజు రత్నమాచారి, దూలపాడు నరేంద్రలను ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో రైతులు కె. శివ, బి.నరేంద్ర, ముత్యాలు, జి. సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షాలు - ముంపున వరిపొలాలు

ప్రమాదపుటంచున పలు మేజర్ ,మైనర్ డ్రైన్లు

పొంగిపొర్లుతున్న కచ్చా డ్రైన్లు

విశాలాంధ్ర-ముదినేపల్లి : గత ఆరు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు వరిపొలాలను ముంచెత్తుతున్నాయి. పలు డ్రైన్లు ప్రమాదపుటం చున ప్రవహిస్తున్నాయి. కొన్ని గ్రామాలలో వీధులు జలమయం అయ్యాయి. కచ్చా డ్రైన్లు పొంగు తున్నాయి .రహదారులలో వర్షపు నీరు ప్రవహించడంతో వాహనదారులకు ఇబ్బందిగా మారింది. ట్రాఫిక్ స్థంభిస్తోంది. మండలంలో ఈ ఏడాది 12వేల ఎకరాలలో వరిసాగు చేయగా సుమారు 1800 ఎకరాలు నీటమునిగి వున్నట్లు వ్యవసాయ శాఖ తెలిపింది

పొలాల్లో వర్షపు నీటిని తక్షణం తరలించాలి :ఏఓ మాధవరావు

భారీ వర్షాల కారణంగా ముంపున వున్న వరిపొలాలలో వర్షపు నీటిని బయటకు తరలించే ప్రక్రియను చేపట్టాలని ఏవో ఎ.మాధవరావు రైతులకు సూచించారు. అనంతరం ఎకరాకు 20 కిలోల యూరియాతో 15 కిలోల ఎంఓపి కలిపి పొలాల్లో వేసుకోవాలన్నారు. జింకుదాతు లోప నివారణకు ముడిజింకు లీటరు నీటికి 2 గ్రాముల చొప్పున ఎకరాకు 400 గ్రాములు పిచికారి చేసుకోవాలని సూచించారు. లేదా చలామిన్ ఎకరానికి 100 గ్రాముల చొప్పున మందు ద్రావణాన్ని పిచికారి చేయాలన్నారు.

రహదారి నిర్మాణం మూణ్ణాళ్ల ముచ్చటే

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : మూడునాళ్ల ముచ్చటగా జాతీయ రహదారి పనులు. తల్లాడ దేవరపల్లి 516 జాతీయ రహదారి నిర్మాణం చేపట్టి 12 నెలలు గడవక ముందే జాతీయ రహదారిపై గోతులు ఏర్పడ్డాయి. కొయ్యల గూడెం మండలం అచ్యుతాపురం గ్రామ శివారు హెచ్ పి పెట్రోల్ బంకు వద్ద జాతీయ రహదారి పై గోతులు ఏర్పడ్డాయి. రాత్రి వేళలో వాహన చోదకులు గోతులలో పడి పలు ప్రమాదాలకు గురవుతున్నారని గ్రామస్తులు తెలుపుతున్నారు. కొయ్యలగూడెం, జంగారెడ్డిగూడెం రోడ్డులో నీలమ్మ గుడి వద్ద రహదారిపై గోతులు ఏర్పడ్డాయి. జంగారెడ్డిగూడెం నుండి తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం మండలం జగన్నాధపురం వరకు రహదారిపై అక్కడక్కడ చిన్నచిన్న గుంతలు ఏర్పడ్డాయి. నాణ్యత లోపంతో రహదారి నిర్మించారని వాహన చోదకులు వాపోతున్నారు. 516 జాతీయ రహదారి డిఇ శ్రీనివాసరావును వివరణ కోరగా రోడ్డు నిర్మాణం చేపట్టిన గుత్తేదారులు ఐదు సంవత్సరాల పాటు రహదారి మరమ్మతులు చేపట్టాల్సి ఉందని, వర్షాలు పడుతున్న కారణంగా రహదారిపై ఏర్పడిన గుంతలకు మరమ్మతులు చేయడానికి ఆటంకం ఉన్నందున వర్షాలు తగ్గిన తరువాత గుత్తేదారులు రోడ్డుపై ఏర్పడిన గుంతలకు మరమ్మతులు చేపట్టనున్నట్టు డిఇ తెలిపారు.



స్మార్ట్ మీటర్ల నిర్ణయం ఉపసంహరించాలి

విశాలాంధ్ర -ఏలూరు: ట్రూ ఆఫ్ సర్దుబాటు అదనపు చార్జీలు రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్లు పెట్టవద్దని కోరుతూ ఏలూరు నగర అభి వృద్ధి కమిటీ, అఖిలపక్ష పార్టీల ఆధ్వర్యంలో జిల్లా విద్యుత్తు శాఖ ఎస్ఈ కార్యాల యం వద్ద ధర్నా నిర్వహించారు. ధర్నానుద్దేశించి సిపిఐ ఏలూరు ఏరియా కార్యదర్శి ఉప్పులూరి హేమశంకర్, సిపిఎం ఏలూరు కార్యదర్శి పి. కిషోర్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు రాజనాల రామ్మోహనరావు మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 9సార్లు విద్యుత్తు చార్జీలు పెంచిందన్నారు. ప్రతిఏటా రూ.2వేల నుండి 2,500 కోట్ల విద్యుత్ చార్జీల భారాన్ని మోపుతున్నదని విమర్శించారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం తీసుకొచ్చిన విద్యుత్తు సంస్కరణ చట్టాన్ని రాష్ట్రంలో అమలు చేయటం వల్ల విద్యుత్ చార్జీలు విపరీతంగా పెరుగుతున్నాయని విమర్శించారు. సర్దుబాటు ట్రూ ఆఫ్ అదనపు సర్వీసు ఇలా రకరకాల పేర్లతో అదనపు చార్జీలను వసూలు చేస్తున్నారని విమర్శించారు. స్మార్ట్ మీటర్లు బిగించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఇప్పటికే రాష్ట్రంలో శ్రీకాకుళం జిల్లాలో పైలెట్ ప్రాజెక్టుగా ప్రారంభించారని అన్నారు. ఈ స్మార్ట్ మీటర్లు అదాని సంస్థ తయారు చేసిందని ఆ సంస్థ నుండి రూ. 5వేల నుండి 10వేల ఖరీదుతో స్మార్ట్ మీటర్లు కొనుగోలు చేస్తున్నారని విమర్శించారు .స్మార్ట్ మీటర్ల కయ్యే ఖర్చును విద్యుత్ వినియోగదారుల నుండే వసూలు చేయడానికి రంగం సిద్ధం చేసిందని దుయ్యబట్టారు. ధర్నా అనంతరం విద్యుత్తు శాఖ జిల్లా అధికారి కి సమస్యలతో కూడిన వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ఏలూరు నగర అభివృద్ధి కమిటీ నాయకులు అడ్వకేట్ కట్ట సత్యనారాయణ, సిపిఐ పట్టణ కౌన్సిల్ సభ్యులు తెర్లపు శ్రీను, కొండేటి విక్రమ్ , కాంగ్రెస్ పార్టీ జిల్లా జనరల్ సెక్రెటరీ దండు బోయిన చంద్రశేఖర్, మండల అధ్యక్షుడు ఉప్పు మురళీకృష్ణ, నాయకులు కోసూరి చంద్రకాంతమ్మ ,ఎస్ వి. సుబ్బారావు, ప్రధాన సుబ్రహ్మణ్య శర్మ, కొమ్మన సాంబశివరావు, లంక రామ్మోహన్, గౌడ రంగబాబు, సాకే బాబు ప్రసాద్, సిపిఎం నాయకులు జి.కోటేశ్వరరావు, జి. ఏసుబాబు సిఐటియు అధ్యక్ష, కార్యదర్శులు బి. జగన్నాధరావు, వి. సాయిబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే మాట్లాడాలని అఖిలపక్షం ధర్నా

విశాలాంధ్ర - వేలేరుపాడు : మండలానికి వచ్చిన ఎమ్మెల్యే వరద బాధిత సమస్యలు, నిర్వా సితులకు పునరా వాసంపై మాట్లాడా లని అఖిలపక్షం ధర్నా చేపట్టింది. భూదేవిపేటలోని కోయిదా వెళ్లే కూడలి వద్ద శుక్రవారం భారత కమ్యూనిస్టు పార్టీ, తెలుగుదేశం పార్టీ, కాంగ్రెస్, సిపిఎం, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలు రోడ్డుపై బైఠాయించారు. పోలవరం నిర్వాసితులకు పునరావసం కల్పిస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చి ఏడాది గడిచినా ఏ ఒక్క కుటుంబానికి ప్యాకేజీ ఇవ్వకుండా పునరావాసం కల్పించకుండా వరదలకు నిండా ముంచుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జగనన్న సురక్ష కార్యక్రమానికి వచ్చిన ఎమ్మెల్యే కస్తూరిబా గాంధీ ఆశ్రమం పాఠశాలలో ఉన్న విషయం తెలుసుకున్న అఖిలపక్షం నాయకులు ఆయనతో మాట్లాడాలని కూడలి వద్ద రోడ్డుపై బైఠాయించి పట్టుపట్టారు. ఎమ్మెల్యే వచ్చినా వారి వద్ద ఆగకుండా వెళ్లిపోవడంతో ఆగ్రహించిన అఖిలపక్ష నాయకులు రోడ్డుకు అడ్డంగా పడుకుని ఎమ్మెల్యే వచ్చేవరకు కదిలేదేలేదని అధికారులకు తేల్చిచెప్పారు. దీంతో కొద్దిసేపు ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. సుమారు రెండు గంటలసేపు వేలేరుపాడు, అశ్వరావుపేట వెళ్లే ప్రధాన రహదారిపై ధర్నా చేపట్టారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వారి వద్దకు వచ్చి మాట్లాడి ప్రతి సమస్యను ప్రభుత్వం వద్దకు తీసుకెళ్లి న్యాయం జరిగే వరకు అండగా ఉంటానని తెలిపారు. అనంతరం ధర్నా విరమించారు.ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి బాడిశ రాము, ఏపీజీఎస్ జిల్లా కార్యదర్శి కారం ధారయ్య, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్ర మధు, టీడిపి మండల అధ్యక్షులు అమరవరపు అశోక్, సీనియర్ నాయకులు శాఖమూరి సంజీవులు, కోమ్మన వెంకటేశ్వరరావు, కురిమళ్ళ సుధాకర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కొల్లూరి సత్యనారాయణ, సిపిఎం మండల కార్యదర్శి ధర్ముల రమేష్, జనసేన మండల అధ్యక్షులు గణేశుల ఆదినారాయణ, మేచినేని సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

మేలైన యాజమాన్య పద్ధతులు అవలంబించాలి

విశాలాంధ్ర -భీమవరం: ఇటీవల కురిసిన వర్షాలకు మేలైన యాజమాన్య పద్ధతులు అవలంబించి వరి పంటను కాపాడుకోవచ్చని జిల్లా వ్యవసాయాధికారి జె.వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం ఆయన మీడియాకొక ప్రకటన విడుదల చేశారు. నీట మునిగిన నారుమళ్ళు, ఊడ్చిన పొలాల్లో నీటిని తోడి వేసి లీటరు నీటిలో 4 ఎంఎల్ నానో యూరియా పిచికారి చేయాలని, వర్షాలు తగ్గాక తెగుళ్ళ సోకకుండా లీటరు నీటిలో 2 గ్రా కార్బన్డిజం, లీటరు నీటిలో హెక్సాకొనాజ్, 2 ఎంఎల్ కలిపి పిచికారి చేయాలని సూచించారు. జిల్లాలో 1,01,237 హెక్టార్ల విస్తీర్ణానికి గాను 4,427 హెక్టార్లలో నారుమళ్లు పూర్తి కాగా 106 హెక్టార్లలో నారుమళ్లు నీటమునిగాయన్నారు. 24,490 హెక్టార్లలో నాట్లు పూర్తి కాగా1888 హెక్టార్లలో నాట్లువేసిన పొలాలు నీట మునిగాయని, ఆయన వివరించారు. మేలయిన యాజమాన్యం పద్ధతులు అవలంబించి పంటలు కాపాడుకోవాలని ఆయన రైతాంగాన్ని కోరారు.

స్వయం ఉపాధి దరఖాస్తులను అధికారులు, బ్యాంకర్లు ఆమోదించాలి

జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్

విశాలాంధ్ర-ఏలూరు: జిల్లాలో నిరుద్యోగ యువత స్వయం ఉపాధి దరఖాస్తులను అధికారులు, బ్యాంకర్లు సమన్వయంతో మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ లోని గౌతమీ సమావేశపు హాలులో శుక్రవారం జిల్లా పారిశ్రామిక ఎగుమతులు ప్రోత్సాహక మండలి సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా పిఎంఈజీపి పథకంలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఖాదీ గ్రామీణ పరిశ్రమల బోర్డుకు 86 మంది దరఖాస్తులు సమర్పించగా వాటిలో 45 దరఖాస్తులు బ్యాంకుల వద్ద పెండింగ్‌లో ఉండడం, 27 దరఖాస్తులను బ్యాంకులు తిరస్కరించడంపై అధికారులు, బ్యాంకర్ల తీరుపై కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. దరఖాస్తులో చిన్న, చిన్న పొరపాట్లు ఉంటే సదరు దరఖాస్తుదారుడికు సరైన మార్గదర్శకత్వం చేసి, బ్యాంకర్లతో సమన్వయం చేసుకుని మంజూరు చేయించవలసిన బాధ్యత కెవిఐబి అధికారులపై ఉందన్నారు. ఈ విషయంలో నిర్లప్తత ప్రదర్శించిన కెవిఐబి అధికారులపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ, భవిష్యత్తులో ఇదే పనితీరు కనపరిస్తే చర్యలు తీసుకుంటానని హెచ్చరిం చారు. సమావేశంలో జిల్లా పరిశ్రమ శాఖ జనరల్ మేనేజర్ పి. ఏసుదాసు, జిల్లా పంచాయతీ అధికారి టి. శ్రీనివాస విశ్వనాథ్, పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ జోనల్ మేనేజర్ కె. బాబ్జి, రవాణా శాఖ ఉప కమీషనర్ శాంతకుమారి, లీడ్ బ్యాంకు జిల్లా మేనేజర్ వినోద్, ఎపిఇపిడిసిఎల్ ఎస్ఇ సాల్మన్ రాజు , జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వై.రామకృష్ణ, కాలుష్య నియంత్రణ మండలి ఇఇ వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా రామచంద్రరాజు

విశాలాంధ్ర - గణపవరం: గణపవరం శ్రీ చింతలపాటి బాపిరాజు ప్రభుత్వ జూని యర్ కళాశాల ప్రిన్సిపాల్ గా ఉప్పలపాటి రామచంద్ర రాజు ఉద్యోగ బాధ్యతలు శుక్రవారం చేపట్టారు. ఇప్పటి వరకు యండగండి జూనియర్ కళాశాలలో పనిచేసి బదిలీపై వచ్చారు. రాజమండ్రి ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ రీజినల్ జాయింట్ డైరెక్టర్ ఉత్త ర్వుల మేరకు ప్రిన్సిపల్‌గా చేరినట్టు రామచంద్ర రాజు తెలిపారు. కాలేజీ సిబ్బంది ఆయనకు అభినందనలు తెలిపారు.

అనాధ ఆశ్రమంలో పిల్లలకు దాత అన్నదానం

విశాలాంధ్ర-ఉంగుటూరు: ఉంగుటూరు గ్రామంలో అనాధ ఆశ్రమంలో పిల్లలకు ఓ దాత శుక్రవారం అన్నదానం చేశారు. నారాయణపురం గ్రామానికి చెందిన నేదూరి గంగాధర్ రావు తన పుట్టిన రోజు వేడుకలను అనాథ పిల్లల మధ్య జరుపుకున్నారు. పిల్లల చేత కేక్ కటింగ్ చేయించారు. ఈ సందర్భంగా దాతను హాస్టల్ నిర్వాహకులు అభినందించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉంగుటూరు మండలం ఎంపీటీసీ ఛాంబర్ అధ్యక్షులు బండారు నాగ రాజు, గ్రామ వైసిపి అధ్యక్షులు పైడి అరుణ్ కుమార్, మతుకుమిల్లి శ్రీధర్, తాడివలస శ్యాము, నటరాజ్, రంగారావు, సూరి రెడ్డి, వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దాత గంగాధర్ రావు మాట్లాడుతూ అన్ని దానముల కన్నా అన్నదానం గొప్పదన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

విశాలాంధ్ర-టి నరసాపురం: ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలని భూక్యా గోపయ్య సక్రమ ఫౌండేషన్ కన్వీనర్ భూక్యా వేణు గోపాల్ తెలిపారు. టి నరసాపురం పంచాయతీ లోని ఎ ఎస్ ఆర్ నగర్ కృష్ణాపురం మెట్ట జంక్షన్ వద్ద ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవ జాతి మనుగడకు మొక్కలు దోహదపడతాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటి సంరక్షణ భాద్యత తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అనుమోలు మురళి, భూక్యా సత్తిబాబు, కుంజా కిరణ్ ,పండు వీరభద్రుడు,రాముడు తదితరులు పాల్గొన్నారు.

టేకు చెట్లు నరికిన 16 మందిపై కేసు నమోదు

విశాలాంధ్ర-టి నరసాపురం: వ్యవసాయ భూమిలోకి అక్రమంగా ప్రవేశించి టేకు, జామాయిల్, వెదురు చెట్లు నరికిన 16మంది వ్యక్తుల పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కె. సతీష్ కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం కృష్ణా జిల్లా గుడివాడ పట్టణానికి చెందిన కాసరనేని చంద్రశేఖర్ టి నరసాపురం మండలంలోని అల్లంచర్ల రాజుపాలెం గ్రామంలో సర్వే నెంబర్ 227, 231 లలో 275 ఎకరాల భూమి తాత ద్వారా సంక్రమించినట్లు, సదరు భూమి మీద ఆంధ్రప్రదేశ్ హైకోర్టు గతములో తనకు అనుకూలముగా ఆ భూమిలోకి ఎవ్వరిని ప్రవేశించరాదని ఉత్తర్వులు కూడా ఇచ్చింది. ఆ భూమిలో టేకు, జామాయిల్, వెదురు తోట సాగుచేస్తున్నారు. ఈనెల 27వ తేదీన అల్లంచర్ల రాజుపాలెం గ్రామానికి చెందిన గొల్లపూడి ఆంజనేయులు మరో 15 మంది అక్రమంగా ప్రవేశించి రూ. లక్ష విలువ గల సుమారు 10 సంవత్సరాల వయసు ఉన్న టేకు, వెదురు, జామాయిల్ తోటను నరుకుతుండగా చంద్ర శేఖర్ గుమస్తా కాకర్ల పుల్లయ్య చూసి కొంతమంది గ్రామస్తులను తీసుకు వెళ్ళగా నరికిన చెట్లను అక్కడే వదిలి పారిపోయినట్లు చంద్ర శేఖర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఆశన్నగూడెం నాగేశ్వరస్వామి ఆలయ ధర్మకర్త మండలి నియామకం

విశాలాంధ్ర - లింగపాలెం : ఆశన్నగూడెంలోని నాగేశ్వరస్వామి దేవస్థానానికి దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నూతన కమిటీని నియమిం చారు. దేవాదాయ శాఖ ఇఓ కె.శ్రీనివాస్ సమక్షంలో నూతన ధర్మకర్త మండలి చైర్మన్‌గా బండారు వెంకటేశ్వరరావు, సభ్యులుగా కె.కాసులు, ఎం.తులసి, టి.సంజీవరావు, సి.నాగకుమారి, ఎన్.గంగారత్నం, పి.జలమయ్యలను నియమించారు. కార్యక్రమంలో సర్పంచ్ పి.పద్మజ, రాము, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కె.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. నూతన కమిటీ మండలి సభ్యులు బాధ్యతలు తీసుకున్నారు.

మొక్కలు నాటండి... పర్యావరణాన్ని పరిరక్షించండి

విశాలాంధ్ర-తణుకు: భవిష్యత్తు తరాలకు పర్యావరణాన్ని అందించేందుకు ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని రాష్ట్ర పౌరసరఫరాల వినియోగ దారుల శాఖ మంత్రి డా.కారుమూరి వెంకట నాగేశ్వరరావు సూచించారు. వన మహోత్సవంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన మాస్ ప్లాంటేషన్ కార్యక్రమాన్ని శుక్రవారం మంత్రి కారుమూరి ప్రారంభించారు. తణుకు మండలం దువ్వ గ్రామంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో దువ్వ సర్పంచ్ అడ్డా సూర్యనారాయణ మూర్తి (బాబు), తణుకు మండలం జెడ్పిటిసి ముళ్లపూడి అన్నపూర్ణ దేవి,దువ్వ గ్రామ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సొసైటీ అధ్యక్షులు జంపన కృష్ణంరాజు, తణుకు మండలం ఎంపిపి రుద్ర ధనరాజు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల వద్దకే ప్రభుత్వ సేవలు

పారదర్శకంగా సంక్షేమ పథకాల అమలు

విశాలాంధ్ర - కాజులూరు : ఎవరూ ఎక్కడకూ వెళ్లాల్సిన అవసరం లేకుండానే ప్రజలకు తమ గ్రామ/వార్డు సచివాలయం పరిధిలో ఇళ్ల వద్దకే ప్రభుత్వ సేవలు అందుతున్నాయని..ప్రత్యక్ష నగదు బదిలీ విధానంలో సంక్షేమ పథకాల ఫలాలు అందుతున్నాయని రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార, పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. శుక్రవారం కాజులూరు మండలం, శలపాక గ్రామ సచివాలయం పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార, పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ పాల్గొన్నారు. గ్రామంలో ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష కార్యక్రమంలో రేషన్ కార్డులు, కుల, ఆదాయ, సీసీఆర్సీ కార్డులు తదితరాలకు సంబంధించి 1,003 మందికి సర్టిఫికెట్లు, పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి వేణుగోపాలకృష్ణ మాట్లాడుతూ కులం, మతం, వర్గం, పార్టీలతో ప్రమేయం లేకుండా అర్హత ఒక్కటే ప్రాతిపదికగా, అత్యంత పారదర్శకంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్తోందని..ఇంకా ఎవరైనా మిగిలిపోతే వారికి కూడా పథకాలు, సేవలు అందించాలనే ఉద్దేశంతో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అమలుచేస్తున్నట్లు తెలిపారు. . కార్యక్రమంలో జెడ్పీటీసీ వి. సుబ్బారావు, ఎంపీపీ ఎం. భారతి మురళి, ఎంపీటీసీ రమేష్, తహసీల్దార్ సాయి సత్యనారాయణ, ఎంపీడీవో రత్నరాజు, సర్పంచ్ పోతురాజు, తదితరులు పాల్గొన్నారు.

అమలాపురంలో విశ్వరూప్ పోటీ చేస్తారు

విశాలాంధ్ర - అమలాపురం : అమలాపురంలో మంత్రి విశ్వరూప్ పోటీ చేస్తారు, భారీ మెజారిటీతో గెలుస్తారు అంటూ జిలా ఇంచార్జి మంత్రి జోగి రమేష్ స్పష్టంచేశారు. శుక్రవారం స్థానిక క్షత్రియ పరిషత్‌లో జరిగిన అమలాపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గ ప్రమాణ స్వీకారానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి జోగి రమేష్ మీడియా తో మాట్లాడారు. ఎంతో సౌమ్యుడైన విశ్వరూప్ ప్రజలకు తలలో నాలుకలా ఉంటూ అభివృద్ధి చేసారని మళ్ళీ ఆయనే పోటీ చేస్తారని భారీ మెజారిటీతో గెలుస్తారన్నారు.

లై డిటెక్టర్ పరీక్షలకు సిద్ధం కావాలి

విశాలాంధ్ర - సామర్లకోట : తనపై అవినీతి ఆరోపణలు చేసిన మాజీ ఉప ముఖ్యమంత్రి, పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప లై డిటెక్టర్ పరీక్షలకు సిద్ధంగా ఉండాలని హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ పెద్దాపురం నియోజకవర్గం ఇంచార్జ్ దవులూరి దొరబాబు శుక్రవారం పాత్రికేయుల సమావేశంలో అన్నారు, అవినీతి ఎవరు చేసారో తేల్చుకునేందుకు లై డిటెక్టర్ పరీక్షలకు ఇంకా రెండు రోజుల సమయం మిగిలి ఉందని లై డిటెక్టర్ పరీక్షలకే ఢిల్లీ ల్యాబ్‌తో మాట్లాడటం జరిగిందని ఈ పరీక్షలకు బాండ్ పేపర్ రాసి ఇవ్వాల్సి ఉంటుందని నాది, చినరాజప్పది బాండ్ పేపర్ సిద్ధం చేశానని నేను సంతకం చేస్తున్నానని మీరు కూడా సంతకం చేయాలని దొరబాబు అన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పంటల సాగుపై సత్య భారతి విద్యార్థులకు అవగాహన

విశాలాంధ్ర - శంఖవరం : పత్తి,వరి నారుమళ్ళగురించి సత్య భారతి పాఠ శాల విద్యార్థులకు గురువారం అవగా హన కల్పించారు. శంఖవరం మండలం మండపం గ్రామంలోని ఉప సర్పంచ్ నక్కా మాణిక్యాలు పంట పొలాల్లో తీసుకుని వెళ్లి విద్యార్థులకు నారుమడి తయారీ వేసే విధానం పత్తి సాగుపై రైతుల ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించారు. పంటలలో మిత్ర పురుగులు శత్రుపురుగులు ఏఏ విధంగా ఉంటాయో వివరించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్స్ కోలా చంద్రరావు, పన్నీరు వీరబాబు, రైతులు వేల్పుల వీరబాబు, నక్కా శ్రీను ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర - జగ్గంపేట : విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని జగ్గంపేట డివిజన్ జేఏసీ కన్వీనర్ ఎస్‌విఎస్ నాయుడు డిమాండ్ చేశారు. రాష్ట్ర, జిల్లా జేఏసీ ఇచ్చిన పిలుపు మేరకు దశల వారి ఉద్యమంలో భాగంగా రెండో రోజు శుక్రవారం మధ్యాహ్న భోజన సమయంలో ధర్నాను డివిజన్ పరిధిలోని ఉద్యోగులు జగ్గంపేట డివిజన్ కార్యాలయం వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా నాయుడు మాట్లాడుతూ తమ సమస్యల పరిష్కారం కోసం గతంలో అనేక ఉద్యమాలు చేయడం జరిగిందన్నారు. ప్రభుత్వం గానీ, సంస్థ గానీ స్పందించకపోవడంతో దశల వారి ఉద్యమం చేయాలని జేఏసీ నిర్ణయించిందన్నారు. రాష్ట్ర, జిల్లా జేఏసీ పిలుపుమేరకు నిరసన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. 31వ తేదీన జగ్గంపేట పట్టణంలో ర్యాలీ నిర్వహించి స్వాతంత్ర్య సమరయోధుల విగ్రహాలకు వినతి పత్రాలు అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ పరిధి లోని విద్యుత్ శాఖ ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు పాల్గొన్నారు.

కిసాన్ సమృద్ధి యోజనతో బహుళ ప్రయోజనాలు

విశాలాంధ్ర - గండేపల్లి : ప్రధానమంత్రి కిసాన్ సమృద్ధి యోజన పథకం కింద రైతులకు బహుళ ప్రయోజనాలు కలుగుతున్నాయని బిజెపి కాకినాడ జిల్లా అధ్యక్షులు చిలుకూరి రామ్ కుమార్ అన్నారు. గండేపల్లి మండలం మురారిలో కిసాన్ సమృద్ధి యోజన కేంద్రం వద్ద కాకినాడ కోరమండల్ ఫెర్టిలైజర్స్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రైతు సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమగ్రాభివృద్ధికి వేల కోట్ల రూపాయలను కేటాయించినట్టు తెలిపారు. 14వ విడత రైతులకు కిసాన్ సమృద్ధి యోజన పథకం కింద ఈరోజు పంపిణీ చేస్తున్న కార్యక్రమాన్ని ప్రొజెక్టర్ ద్వారా రైతులకు వీక్షింప చేశారు. రైతులకు నరేంద్ర మోడీ ఎరువులు ద్వారా అందిస్తున్న రాయితీలను, నగదు బదిలీ తదితర విషయాలను రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకురాలు కామినేని జయశ్రీ, కోరమాండల్ ఫెర్టిలైజర్స్ ఏరియా మేనేజర్ రామోజీ, మండల వ్యవసాయ అధికారి సద్గురు మూర్తి, మండలంలోని బిజెపి నాయకులు, రైతులు పాల్గొన్నారు.

ఉమర్ ఆలీషా రూరల్ డెవలప్మెంట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నందనవనం

విశాలాంధ్ర - పిఠాపురం : ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఉమర్ ఆలీషా రూరల్ డెవలప్మెంట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదికవి నన్నయ యూనివర్సిటీలో నన్నయ నందనవనం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఉమర్ ఆలీషా రూరల్ డెవలప్మెంట్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ ఉమర్ ఆలీషా, వీసీ ఆచార్య కె. పద్మరాజు హాజరై విశ్వవిద్యాలయ ప్రాంగణంలో మొక్కలు నాటారు. విశ్వవిద్యాలయ అధికారులు, ట్రస్ట్ సభ్యులు మొక్కలు నాటి వాటి పర్యవేక్షణ బాధ్యతలను చేపట్టారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఉమర్ ఆలీషా మాట్లాడుతూ ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో వీసీ ఆచార్య కె.పద్మరాజు ఆహ్వానం మేరకు మొక్కలు నాటి రెండు సంవత్సరాలలో నన్నయను నందనవనంగా తీర్చిదిద్దుతామని అన్నారు. వీసీ ఆచార్య మాట్లాడుతూ నా మొక్క నా శ్వాస అనే పేరుతో ఉమర్ ఆలీషా రూరల్ డెవలప్మెంట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చేస్తున్న సేవా కార్యక్రమాలు ప్రశంసించారు.

చిన్నపాటి వర్షానికే కొమరగిరి ఇళ్ల స్థలాలు మునక

విశాలాంధ్ర - కాకినాడ : పేదవాడికి ఇళ్ల స్థలాల పేరుతో కాకినాడ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి కోట్ల రూపాయలు దోచుకొని కాకినాడ నగర ప్రజలను నట్టేట ముంచారని కాకినాడ సిటీ నియోజవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి, మాజీ శాసనసభ్యులు వనమాడి కొండబాబు విమర్శించారు. యు కొత్తపల్లి మండలం కొమరగిరి ప్రాంతంలో కాకినాడ నగర ప్రజలకు మంజూరు చేసిన ఇళ్ల స్థలాలను శు క్రవారం కొండబాబు పరిశీలించారు. ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి తన స్వార్థ ప్రయోజనాలు కోసం పేదోడి పేరుతో కోట్ల రూపాయలు దోచుకోవడానికి కాకినాడ నగర ప్రజలకు 18 కిలోమీటర్ల దూరంలో కొమరగిరిలో ఇళ్ల స్థలాలను ఇచ్చి లబ్ధిదారులను నట్టేట ముంచారని అన్నారు. చిన్నపాటి వర్షానికే కొమరగిరి కాలనీ ముంపుకు గురవుతోందని, నాసిరకం నిర్మాణాలు చేపడుతున్నారని, మరోపక్క సముద్రపు కెరటాలు ఎగిసిపడి రహదారులు సైతం కోతకు గురవుతున్న విషయం తెలిసి కూడా ద్వారంపూడి తన స్వలాభం కోసం కొమరగిరిలో భూములు తీసుకుని మెరకు పనులు పేరుతో పెద్దాపురంలోని ప్రభుత్వ కొండలను తవ్వి ఫిల్లింగ్ చేసి కోట్ల రూపాయలు దోచుకుంటున్నారన్నారు. కాకినాడ ప్రజలకు కొమరగిరి ప్రాంతంలో స్థలాలు ఇవ్వడం సరైన విధానం కాదని, కాకినాడ నగర పరిధిలో చుట్టుపక్కల ప్రాంతాల్లో గృహాలు నిర్మాణానికి అనువైన ప్రభుత్వ ప్రైవేటు భూములు ఉన్నాయని, పేదలకు సురక్షిత ప్రాంతాల్లో ఇళ్ల స్థలాలు ఇవ్వాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షులు మల్లిపూడి వీరు, మాజీ కార్పొరేటర్లు తుమ్మల రమేష్, ఒమ్మి బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.



తూతూ మంత్రంగా ఓటరు జాబితా నిర్వహణ తగదు

విశాలాంధ్ర - కాకినాడ : కాకినాడ నగరంలో ఓటరు జాబితా ప్రక్షాళన తూతూ మంత్రంగా జరుగుతున్నదని పౌర సంక్షేమ సంఘం కన్వీనర్ సామాజిక వేత్త దూసర్లపూడి రమణరాజు పేర్కొన్నారు. ఇంటింటికీ వెళ్లి జాబితా ప్రకారం వున్నదీ లేనిదే సమాచారం నేరుగా సేకరించకుండా కొంతమంది వ్యక్తుల వద్ద సర్వే చేసుకుని ముగిస్తున్న ధోరణి వలన ప్రయోజనం లేదన్నారు. ఎలక్షన్ కమిషన్ చేపట్టిన ప్రయోజనాలు చేరువ కావడం లేదన్నారు. నివాసేతరుల ఓట్లు కొనసాగుతున్న దుస్థితి ప్రతి పోలింగ్ స్టేషన్ ఓటరు జాబితాలో వుందన్నారు. కేవలం ఫోన్ ద్వారా మాత్రమే వీటి ఆరా తీయడం తగదన్నారు. దుకాణాల్లో పనిచేసే వారి ఓట్లు వారు నివసించే ప్రదేశంతో బాటుగా పని చేస్తున్న ప్రాంతంలో కూడా రెండు చోట్ల కొనసాగుతున్న స్థితి 50శాతం వుందన్నారు. జిల్లాలోని రెండు మూడు నియోజక వర్గాల్లో ఒకే పేరు నమోదు వున్న దాఖలాలు వున్నాయన్నారు. హాస్టల్స్‌లో ఉంటున్న 18సంవత్సరాలు నిండిన ఎస్‌సిబిసి విద్యార్థుల పేర్లు అక్కడి ఓటరు జాబితాలో నమోదు కావడం లేదన్నారు. దీనివలన ఎస్‌సి ఓటు శాతం ఉద్దేశ్యపూర్వకంగా తగ్గుతోందన్నారు. ఓటు నమోదు అంశంపై లోకల్ కేబుల్ చానల్స్ లోనూ..రోజు వారీ పబ్లిక్ మైక్ ప్రచారంతో బాటుగా..ఇంటింటికీ కరపత్రం అందించే ప్రక్రియ చేపట్టాలని కోరారు. ప్రతి వారం రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహణ చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

తోట త్రిమూర్తులూ మీకు సిగ్గుందా

ద్వారపూడి రోడ్డును ఎంతకాలం నెట్టుతారు..?

ఉత్తర ప్రగల్భాలు ఏమయ్యాయి

ఎమ్మెల్యే వేగుళ్ల ధ్వజం

విశాలాంధ్ర - మండపేట : మండపేట ద్వారపూడి రోడ్డును మేము కాబట్టి నిర్మిస్తున్నామని ఏడాది కాలంగా గొప్పలు చెప్పుకుంటూ కాలయాపన చేస్తున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులును మీకు సిగ్గుందా అని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ధ్వజమెత్తారు. అదిగో వేస్తాం ఇదిగో వేస్తామంటూ ప్రజలను ఇంకెంత కాలం మభ్య పెడతారో చెప్పి తీరాలని ఆయన ప్రశ్నించారు. ఆషాడం ముందు ఆ రోడ్డు పనులకు శంఖుస్థాపన చేసి రోడ్డును తొందరగా పూర్తి చేసి ప్రజల వెతలు తీర్చాలనే ఉద్దేశంతో హడావిడిగా భూమి పూజ చేసేశామని మరో సారి అధికారికంగా అందరితో కలిపి శంఖుస్థాపన చేస్తామని పలికిన ఉత్తర కుమారుని ప్రగల్భాలు ఏమయ్యాయని ఎమ్మెల్యే వేగుళ్ల గట్టిగా నిలదీశారు. టీడీపీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేఖరుల సమావేశంలో ఆయన ద్వారపూడి మండపేట రోడ్డు నిర్మాణంలో తలెత్తిన తీవ్ర జాప్యాన్ని నిరసిస్తూ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులుపై మండిపడ్డారు. ఆ రోడ్డు నిర్మాణానికి కేంద్రం ప్రభుత్వం నుంచి నిధులు మంజూరై మూడేళ్లు అయ్యిందన్నారు. రోడ్డు నిర్మాణం చేపట్టి ఏడాది పూర్తయిందన్నారు. నాటి నుండి నేటి వరకు ఆ రోడ్డుకు అతీగతీ లేదన్నారు. రోడ్డు మొదలైనప్పటి నుంచి ఇప్పటి వరకు వందలాది మంది ప్రయాణికులు కాళ్ళూ చేతులూ, వెన్నుముకలు విరగ్గొట్టుకుని ఆస్పత్రుల పాలై అయినకాడికి చేతి చమురు వదిలించుకుంటుంటే పాలక పక్షానికి చీమ కుట్టినట్టైనా లేదంటూ ఎమ్మెల్సీ తోటపై మండి పడ్డారు. ఈ దుస్థితి నుంచి ప్రజలను ఎప్పుడు విముక్తి పరుస్తారో జవాబు ఇవ్వాలన్నారు. తొందరలోనే రోడ్డు పూర్తి చేసి ముగింపు పలకక పోతే ప్రజలతో కలిసి టీడీపీ తరపున ప్రత్యక్ష పోరాటానికి దిగుతామని ఎమ్మెల్యే వేగుళ్ళ ఈ సందర్భంగా తోటను హెచ్చరించారు. సమావేశంలో టీడీపి టౌన్ ప్రెసిడెంట్ వుంగరాల రాంబాబు, టీఎన్టీయూసీ రాష్ట్ర అధికార ప్రతినిధి వాదా ప్రసాదరావు, టీడీపీ ఎస్సీ విభాగం నాయకుడు మందపల్లి దొరబాబు, నాయకులు మేడపాటి రవీంద్రారెడ్డి, వాకచర్ల గుప్తా, నామాల సత్యనారాయణ, చింతపల్లి రామకృష్ణ పాల్గొన్నారు.

మొక్కలు నాటిన ఎంపిడివో

విశాలాంధ్ర - సీతానగరం: పర్యావరణ పరిరక్షణ మన అందరీ బాధ్యత అని ఎంపిడిఓ కె. రమేష్ అన్నారు. మండలంలో రఘుదేవ పురం గ్రామంలో గల సచివాలయం వద్ద శుక్రవారం మహిళా కలెక్టర్ దినోత్సవం సందర్భంగా కలెక్టర్ ఆదేశాల మేరకు మొక్కలు నాటినట్టు తెలిపారు. గ్రామంలో కొత్తగా నిర్మాణం అవుతున్న ఎస్ సి, బి సి కమ్యూనిటీ హాలును పరిశీలించి గుత్తేదారులతో త్వరితగతిన పూర్తి అయ్యేలా పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన బంగారు కొండ పథకం అమలు తీరు పై రాపాక గ్రామ లబ్దిదారులైన తల్లి మౌనిక, పాప రష్మికను అరోగ్య పరిస్థితుల పై అడిగి తెలుసుకున్నారు. జగనన్న ఇళ్ళ స్థలాల నిర్మాణం వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.

గ్రామ పరిశుభ్రత పై అవగాహన సదస్సు

విశాలాంధ్ర - చాగల్లు : ఎస్ ఎస్ జి -2023 కు సంబంధించి చిక్కాల గ్రామపంచాయతీ వద్ద జరిగిన కార్యక్ర మంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ నల్లూరి అప్పారావు మాట్లాడుతూ గ్రామ పరిశు భ్రత వ్యక్తిగత పరిశుభ్రత పై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఏఈ అజయ్ బాబు , ఈవో పి ఆర్ డి ఆర్ శ్రవణ్ కుమార్ , పంచాయతీ కార్యదర్శి ఎస్.కె కాసిం, గ్రామ సర్పంచ్ కొయ్య మణి, అంగన్వాడీ కార్యకర్తలు, స్కూల్స్ ప్రధానోపాధ్యాయు ఆశ వర్కర్స్ , సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

యువత చేతుల్లోనే దేశ భవిష్యత్తు

విశాలాంధ్ర - రాజానగరం : నేటి బాలలే రేపటి పౌరులని, అటువంటి యువత చేతుల్లోనే దేశ భవిష్యత్తు ఆధారపడి ఉంటుందని డాక్టర్ వినయ్ సుంకర ఫౌండేషన్ అధినేత సుంకర వెంకటేశ్వరరావు అన్నారు. డాక్టర్ వినయ్ సుంకర ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచితంగా అందిస్తున్న శిక్షణ తరగతులు గ్రామగ్రామాల్లో విస్తరిస్తున్నది. మండలంలోని కొత్త తుంగ పాడులో రెండో బ్యాచ్,పాత తుంగపాడు గ్రామాల్లో ఉచిత మగ్గం శిక్షణ తరగతులను గురు,శుక్రవారాల్లో వరుసగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లల పెంపకంలో తల్లి పాత్ర ఎంతో కీలకమని చెప్పారు. సెల్ ఫోన్ వల్ల మంచి,చెడు రెండు ఉన్నాయని,వాటిని కేవలం మంచికే వినియోగించాలని సూచించారు. తమ ఫౌండేషన్ ఉచితంగా అందిస్తున్న శిక్షణ తరగతులను శ్రద్ధగా నేర్చుకొని తమ కుటుంబ ఆదాయాలను పెంపొందించుకోవాలని ఆకాంక్షించారు. విశిష్ట అతిథిగా విచ్చేసిన గ్రామ పంచాయతీ సెక్రటరీ శ్రీరామ్ మాట్లాడుతూ సమాజంలో డబ్బు, హోదా ఉన్నవారు చాలామంది ఉంటారని, సేవా దృక్పథం మాత్రం సుంకర ఫౌండేషన్ వంటి కొంత మందికే ఉంటుందని కొనియాడారు. తొలుత ఫౌండేషన్ మేనేజింగ్ డైరెక్టర్లు సుంకర నాగేశ్వరరావు, సుంకర వీరాస్వామిలతో కలిసి రెండు గ్రామాల్లో మగ్గం శిక్షణ పొందేందుకు వచ్చిన సుమారు 120 మంది మహిళలకు కిట్లను అందజేశారు.ఈ కార్యక్రమంలో శిక్షకురాలు గంధం కృష్ణవేణి, ఈవురి దుర్గ, దివాన్ చెరువు, వెలుగుబంధ గ్రామాల నుండి ఫౌండేషన్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఒక్క పంచాయతీ ముద్దు రెండు పంచాయతీలు వద్దంటూ నినాదాలు

విశాలాంధ్ర - కొవ్వూరు రూరల్ : కొవ్వూరు మండలం దొమ్మేరు గ్రామం మేజర్ పంచా యతీ. కొంతమంది రాజకీయ నాయకులు తమ స్వలాభం కోసం దొమ్మేరును రెండుగా విడదీ యాలని కుట్ర పన్నుతున్నారు దొమ్మేరు దొమ్మేరు సవరం అనేవి పేర్లే తప్ప అక్కడ ఉన్న ప్రజలందరూ కలిసే ఉంటారు.ఎ అలాంటి దొమ్మేరు గ్రామాన్ని విడదీయడం అనేది సమంజసం కాదని దొమ్మేరు గ్రామ ఉపసర్పంచ్ కలగర సుబ్బారావు తెలిపారు. ఒక పంచాయతీ ముద్దు రెండు పంచాయతీలు వద్దు అని గ్రామ ప్రజలందరూ పంచాయతీని ముట్టడించి దొమ్మేరు గ్రామ కార్యదర్శి, దొమ్మేరు గ్రామ ప్రెసిడెంట్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమానికి కొవ్వూరు జడ్పిటిసి బంతా వెంకటలక్ష్మి, దొమ్మేరు ఎంపీటీసీ వాడవల్లి వెంకట సత్యనారాయణ, ఆసపు సరోజిని, యలమర్తి శ్రీరామ్ ప్రసాద్, కలగర రంగారావు, గారపాటి శ్రీదేవి, గారపాటి రామకృష్ణ, దొమ్మేరు తెలుగుదేశం పార్టీ వార్డు మెంబర్లు , దొమ్మేరు గ్రామ ప్రజలు భారీ ఎత్తున పాల్గొన్నారు

మహిళా సాధికారిత టిడిపితోనే సాధ్యం

విశాలాంధ్ర - కిర్లంపూడి : మహిళా సాధికారిత టిడిపితోనే సాధ్యమని జగ్గంపేట మాజీ ఎమ్మెల్యే, టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు జ్యోతుల నెహ్రూ అన్నారు. శు క్రవారం కిర్లంపూడి మండలం కృష్ణవరం గ్రామంలో కాకినాడ జిల్లా తెలుగు యువత అధికార ప్రతినిధి బొదిరెడ్ల సుబ్బారావు ఆధ్వర్యంలో అధిక సంఖ్యలో మహిళలతో గ్రామమంతా పర్యటించి చంద్రబాబు ప్రకటించిన భవిష్యత్తు గ్యారంటీ, మహిళా శక్తి పథకాలను ప్రజలకు వివరిస్తూ గ్రామంలో ఇంటింటికి పర్యటించారు. ఈ సందర్భంగా జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ రాష్ట్రంలో తెలుగుదేశం ప్రభుత్వంతోనే మహిళా సాధికారత సాధ్యం అయ్యిందని అన్నారు. తెలుగుదేశ ప్రభుత్వం మహిళలకు రక్షణ కవచంలా పనిచేసేదని ఈనాడు మహిళలు బయటకు వచ్చి స్వతంత్రంగా తిరిగే పరిస్థితి లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో నాలుగు మండలాలపార్టీ అధ్యక్షులు చదరం చంటిబాబు, పోతుల మోహనరావు, మారిశెట్టి భద్రం, మంగ రౌతు రామకృష్ణ, కోర్పు సాయి తేజ, తదితరులు పాల్గొన్నారు.

డ్రాప్ అవుట్లను స్కూల్లో చేర్పించాలి

విశాలాంధ్ర - కరప : మండలంలో బడి బయట ఉండే పిల్లలను బడిలో చేర్పించే విధంగా విద్యాశాఖ చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో కే అప్పారావు తెలిపారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సచివాలయ ఎడ్యుకేషన్, వెల్ఫేర్ అసిస్టెంట్, సిఆర్పిలతో సమావేశం నిర్వహించామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ కే బుల్లి కృష్ణవేణి పాల్గొని ఎడ్యుకేషన్ వెల్ఫేర్ అసిస్టెంట్లతోను, సిఆర్పిలతో బడిబయట ఉండే పిల్లలను వాలంటీర్లు సహాయంతో గుర్తించి వాళ్లను వారి తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేసి బడిలో చేర్పించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని ఆమె పేర్కొన్నారు. ప్రస్తుతం మండలంలో 219 మంది పిల్లలు బడి బయట ఉన్నారని వారిని స్కూళ్లలో చేర్పించే చర్యలు తీసుకుంటున్నామన్నారు.



కరపలో మొబైల్ అన్న క్యాంటీన్లు

విశాలాంధ్ర - కరప : కరపలో మొబైల్ అన్న క్యాంటీన్లను శుక్రవారం కరప తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు దేవు వెంకన్న ఆధ్వర్యంలో కటకం శెట్టి ప్రభాకర్ మినీ వ్యాన్ పై అన్న క్యాంటీన్ భోజనాలు ప్రజలకు అందించారు. ఈ సందర్భంగా వెంకన్న మాట్లాడుతూ వైసీపీ పరిపాలన కాలంలో ప్రజలు ఆకలి తీర్చిన అన్న క్యాంటీన్లను తొలగించడం చాలా బాధాకరమని ఎంతోమంది పేదలు అన్న క్యాంటీన్‌లో భోజనాలు చేసి ఆనందం పొందే వారిని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటలక్ష్మి, జగ్గారావు, తదితర నాయకులు పాల్గొన్నారు.

మొక్కలను నాటాలి... వాటిని పరిరక్షించాలి

విశాలాంధ్ర - ఆలమూరు : మొక్కలను నాటి వాటిని పరిరక్షించిన నాడే అవి మానుగా మారి భావితరాలవారికి ఫలాలను అందించడంతో పాటుగా ప్రకృతి సమతుల్యతను కాపాడుతుందని ఆలమూరు ఎంపీపీ తోరాటి లక్ష్మణ రావు, మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాసు, ఎంపీడీవో జాన్ లింకన్ అన్నారు. కొత్తపేట నియోజకవర్గంలో ఆలమూరు మండలం చెముదులంక ఎస్టీఎస్‌ఎస్‌ఎమ్ ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవం సందర్భంగా గ్రామ సర్పంచ్ తమ్మన సమకూర్చిన వివిధ రకాల పండ్ల జాతి మొక్కలను విద్యార్థులతో కలిసి నాటారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ఆరోగ్యకరమైన జీవన శైలికి ప్రకృతి పున్నదని, మన జీవితంలో తొలి బాధ్యతగా మొక్కలను నాటి ప్రకృతిని రక్షించాలని అన్నారు. నేడు కాంక్రీట్ జంగిల్‌గా పట్టణాలు, గ్రామాలు రూపు దిద్దుకోవడం, వాహనాలు పెరగడంతో వాతావరణం విపరీతమైన కాలుష్యం బారిన పడడం చూస్తున్నామని, పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ ఖచ్చితంగా మొక్కలు నాటి వాటి పరిరక్షణ సామాజిక బాధ్యతగా చేపట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపిడి కే.సత్యనారాయణ, ఎంఈఓ పి.సుబ్బరాజు, ప్రధానోపాధ్యాయుడు జివిస్ చక్రవర్తి, వ్యవసాయ సలహా కమిటీ అధ్యక్షుడు యనమదల నాగేశ్వరరావు, మాజీ ఎంపీపీ తోరాటి రాంబాబు, దొండపాటి చంటి, దూలం సత్తిబాబు అడబాల వీర్రాజు, బి. వీర వెంకట్రావు, సుంకర శ్రీనివాసు, సుంకర కామరాజు, యు. సుందర్ విజయం పలువురు నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్థలాలు ఎక్కడో చూపించండి

విశాలాంధ్ర - సామర్లకోట : జగనన్న సురక్షలో భాగంగా సామర్లకోటలోని 15 సచివాలయం పరిధిలో వాటర్ ట్యాంకుల వద్ద మున్సిపల్ కమిషనర్ జే రామారావు ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు, మునిసిపల్ చైర్పర్సన్ గంగిరెడ్డి అరుణ కృష్ణమూర్తి వార్డ్ కౌన్సిలర్ రెడ్నం సునీత దొరబాబు తదితరులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని మరల ముఖ్యమంత్రిగా జగన్మోహన్ రెడ్డిని స్థానిక నాయకుడు అయిన దవులూరి దొరబాబుని ఎమ్మెల్యేగా గెలిపించుకోవాలని అన్నారు. లబ్ధిదారులకు సర్వీస్ సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. గతంలో ఇళ్ల పట్టాలు ఇచ్చి స్థలాలు చూపించలేదని లబ్ధిదారులు ప్రజాప్రతినిధులను నిలదీశారు. ఈ కార్యక్రమంలో ఇరుసుమల్ల సాయి, సచివాలయంల కార్యదర్శులు, సిఆర్పిలు లబ్ధిదారులు భారీగా పాల్గొన్నారు.

మధుమేహంపై అవగాహన కలిగి ఉండాలి

విశాలాంధ్ర - కాకినాడ : కాకినాడ జిల్లా కాకినాడ స్థానిక గాంధీనగర్ వంటిమామిడి జంక్షన్ వద్ద గల అశ్విని హాస్పిటల్‌లో అలయన్స్ క్లబ్ ఆఫ్ కాకినాడ స్వాతి హెల్పింగ్ హాండ్స్ ఆధ్వర్యంలో క్లబ్ అధ్యక్షులు అలయ్ కిరణ్ కుమార్ అధ్యక్ష తన మధుమేహ వ్యాధి పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆలయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ కమిటీ చైర్మన్ డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు విశిష్ట అతిథిగా అలయన్స్ ఇంటర్నేషనల్ పిఆర్ఓ అలా మాటూరి శిరీష, గౌరవ అతిథిగా అలయన్స్ క్లబ్స్ వైస్ గవర్నర్ అలై వనుం శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 60 మందికి మధుమేహ పరీక్షలు నిర్వహించి వారికి అవసరమైన మందులను ఉచితంగా అందించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి అలై పెంకె గోవిందరాజు, కోశాధికారి అలై కొత్త శ్రీరాములు, అలై మణికంఠ, అలై వనుం ఉపేంద్రనాథ్, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

వరద ఉధృతితో ప్రజలను సురక్షిత ప్రాంతానికి చేర్చాలి

విశాలాంధ్ర - ఆత్రేయపురం : మండలపరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో ఎంపిడిఓ నాతిబుజ్జి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపిడిఓ నాతి బుజ్జి మాట్లాడుతూ ప్రస్తుతం వరద ఉధృతి పెరుగుతున్న కారణంగా ఎక్కడైనా ఏటిగట్లు బలహీనంగా ఉంటే వెంటనే సమాచారం అందించి అక్కడ ఉన్న ప్రజలను సురక్షిత ప్రాంతానికి తరలించుటకు పంచాయితీ కార్యదర్శులు, గ్రామ సచివాలయ సిబ్బంది, మరియు వాలంటీర్లు సిద్దంగా ఉండాలని తెలియజేసారు. వరద ఉధృతి పెరుగుతున్న కారణంగా ప్రమాదం పొంచి ఉన్న ఎటిగట్లలో ఇసుక బస్తాలను అందుబాటులో ఉంచుకోవాలని, అధికారులకు ఎప్పటికప్పుడు వరద తీవ్రత సమాచారం అందించాలని తెలియజేసారు. వర్షాలు ఎక్కువగా ఉన్నందున ప్రజలు ఎటువంటి రోగాల బారిన పడకుండా పంచాయతీల్లో శానిటేషన్ మరియు, బ్లీచింగ్ సిద్దం చేసుకోవాలని తెలియజేశారు. పశువులకు అవసరమైన మేతను నిల్వ ఉంచుకొవలసినదిగా తెలియజేసారు. ఈ సమావేశములో ఎంపిడి నాతి బుజ్జి, పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.

క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదం

విశాలాంధ్ర - పెద్దాపురం : క్రీడలు మానసికోల్లాసానికి, శారీరక దృఢత్వానికి ఎంతగానో దోహదపడతాయని పెద్దాపురం, గండేపల్లి మండల విద్యాశాఖాధికారులు ఇ ప్రభాకర శర్మ, రామకృష్ణారెడ్డి, కెవిరెడ్డి అన్నారు. పెద్దాపురం నవోదయ విద్యాల యలో రెండు రోజుల పాటు నిర్వహించే క్లస్టర్ స్థాయి బాల్ గేమ్స్ పోటీలను శుక్రవారం అట్టహాసంగా ముగిశాయి. ఈ సందర్భంగా జవహర్ నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ కె రామిరెడ్డి అధ్యక్షతన జరిగిన క్రీడా పోటీల నుద్దేశించి వారు మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు క్రీడల పట్ల ఆసక్తిని కనపర్చాలన్నారు. విద్యార్థులు క్రీడాసక్తిని మరింత పెంపొందించుకుని విజయ అవకాశాలు సాధించాలన్నారు. తొలుత జ్యోతిప్రజ్వలన చేసి క్రీడలను ప్రారంభించారు. అనంతరం క్లస్టర్ లెవల్ బాల్ గేమ్స్ (వాలీబాల్, హ్యాండ్బాల్, బాస్కెట్బాల్) క్రీడా పోటీలు నిర్వహించగా నవోదయ తూర్పుగోదావరి 1.2తో పాటు విశాఖపట్టణం, విజయనగరం, శ్రీకాకుళం, కష్ణా, పశ్చిమ గోదావరి, గుంటూరు, యానాం నవోదయ కేంద్రాల నుంచి సుమారు 250 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో హాజరు కాగా క్లస్టర్ లెవల్స్ బాల్ గేమ్స్ ఎంపిక చేశారు. ఈ పోటీల్లో ఎంపికైన విద్యార్థులు రీజనల్ లెవల్ పోటీలకు తలపడతారని పీఈటి సత్యన్నారాయణ తెలిపారు. రీజనల్ లెవల్కు విజయనగరం, కాసరడ, కేరళ, హావేరి, కర్నాటక నవోదయ విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రామిరెడ్డి తెలిపారు.

సార్వా వరిపైర్ల పరిశీలన

విశాలాంధ్ర-మండవల్లి: ముంపు బారిన పడిన వరి పైర్లను శుక్రవారం ఏడిఎ జి.వెంకటమణి,ఏవో షేక్‌జరీనాలు సందర్శించి రైతులకు పలు సూచనలు చేశారు.అనంతరం మండవల్లి వ్యవసాయశాఖ కార్యాలయంలో డివిజన్ పరిధిలోని గ్రామ వ్యవసాయ సహాయకులకు ఏడిఎ ఆధ్వర్యంలో ఖరీఫ్- 2023 ఈపంట నమోదుపైశిక్షణా కార్యక్రమం జరిగింది. అధిక వర్షాలకు పొలాల్లో నీటిని బయ టకు తీసిన వెంటనే బూస్టరు డోసుగా ఎకరాకు 20 కిలోల యూరియా 15కిలోల మ్యూరేట్‌ఆఫ్‌పొటాష్ పైర్లకు చల్లేలాగా రైతులను చైతన్యం చేయాలన్నారు..జింకు ధాతు లోప నివారణకు ముడిజింకుని పిచికారి చేయాలని లేదాచిలామిన్ జింకును స్ప్రే చేయాలని పేర్కొన్నారు. ఎరువులు అందుబాటులో ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని, సబ్సిడీపై డ్రోన్లు తీసుకునేలాగా రైతులను ప్రోత్సహించాలని ఏడిఎ సూచించారు. పొలాల్లో నీటిని మళ్లించేందుకు డ్రైన్లను పరిశు భ్రపర్చుకునేందుకు రైతులకు అండగా ఉండాలని వివిఎలను కోరారు.

నీట మునిగిన వరి చేలు

విశాలాంధ్ర-పోడూరు: గత మూడు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు వరద నీరు తోడు కావడంతో పోడూరు మండలం లోని గుమ్ములూరు వద్దిపర్రు గ్రామాల మధ్య నుండి ప్రవహించే నక్కల డ్రైను పొంగి ప్రవహిస్తుండడంతో వద్దిపర్రు నీట మునిగింది. వద్దిపర్రు లోని వరిచేలు చెరువులతోపాటు ప్రధాన రహదారులు పల్లపు వీధులు జలమయమయ్యాయి. అచంట మండలంలోని వల్లూరు తదితర గ్రామాలనుండి వద్దిపర్రు గుమ్ములూరు మీదుగా వెళ్లే ప్రయాణికులు రహదారులు జలమయం కావటంతో ఇబ్బంది పడుతున్నారు. రెవెన్యూ అధికారులు పరిస్థితిని పరిశీలిస్తున్నారు.